# కాకినాడ టూ కేసముద్రంకు...

- ధాన్యం ప్రయాణంలో మతలబేంటి?
- సీఎంఆర్‌కు కేటాయింపు పేరుతో ధాన్యం తరలింపు...
- తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎఫ్‌సీఐ గోదాములకు బియ్యం చేరవేత...!
- ధాన్యం కేటాయింపు నుంచి గోదాం చేరే వరకు ప్రతి దశలో లెక్కలు ఉన్నాయా...?
- అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు...



**కేసముద్రం, సెప్టెంబర్ 25 (ప్రభాత గమనం):**

అది కాకినాడ నుంచి వచ్చిన ధాన్యం కావచ్చు... లేదా స్థానికంగా కొనుగోలు చేసిన బియ్యం కావచ్చు... ముసుగు ఏదైనా, ఆశయం మాత్రం ఓ వర్గం జేబులు నింపుకోవడమే అని చెప్పవచ్చు! ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'కస్టమ్ మిల్లింగ్ రైస్' ప్రక్రియ అక్రమార్కులకు కామధేనువుగా మారింది. కాకినాడ ప్రాంతం నుంచి బియ్యం కొనుగోలు చేసి కేసముద్రం వరకు సాగుతున్న ఈ అక్రమ రవాణా దందా, అధికార యంత్రాంగం నిద్రమత్తును, మిల్లు యజమానుల బరితెగింపును ఎత్తిచూపుతోంది.రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, ఆ బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి (ఎఫ్.సి.ఐ - ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అప్పగించడమే సీఎమ్ఆర్ లక్ష్యం. అయితే కాకినాడ ప్రాంతం నుండి బియ్యం అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా కేసముద్రంలో దిగుమతి చేసుకుని కొంతమంది మిల్లర్లు ధాన్యంతో దాగుడుమూతలు ఆడుతున్నారు.కేటాయించిన ధాన్యంలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతున్నట్లు సమాచారం అందిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టలు వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మాత్రమే మిల్లింగ్ చేసి, ఆ బియ్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన మార్గంలో గోదాములకు పంపాలి. కానీ, ఇక్కడ కథ తలకిందులైంది.రైస్ మిల్లుల్లో ధాన్యం బియ్యంగా మారే క్రమంలో అసలైన దందా మొదలవుతోంది. ప్రభుత్వం సరఫరా ధాన్యాన్ని ఎంచక్కా అమ్ముకొని అరాకొర ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించి ప్రభుత్వానికి సిఎంఆర్ రూపంలో ధాన్యాన్ని పెట్టి మిల్లర్లు అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు.కాకినాడ ప్రాంతం నుంచి వేరే గోనె సంచులలో కొనుగోలు చేసి నిల్వలను ఇతర సంచుల్లోకి మారుస్తున్నారు. కాకినాడ నుంచి వచ్చిన ధాన్యాన్ని, స్థానికంగా లభించే బియ్యంగా లేబుళ్లు, బస్తాలు మార్చి కేసముద్రంలోని ఎఫ్‌సీఐ గోదాములకు దర్జాగా తరలిస్తున్నారు.పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ లేదా పేదలకు అందాల్సిన నాణ్యమైన బియ్యం స్థానంలో, నాసిరకం బియ్యం గోదాముల్లోకి చేరుతున్నాయి.మార్కెట్ ధరలకు, ప్రభుత్వ మద్దతు ధరలకు ఉన్న వ్యత్యాసాన్ని అక్రమార్కులు తమ జేబుల్లో వేసుకుంటున్నారు.కాకినాడ నుంచి కేసముద్రం వరకు వందల కిలోమీటర్ల దూరం సాగే ఈ ధాన్యం, బియ్యం రవాణాలో చెక్ పోస్టులు, తనిఖీ యంత్రాంగం ఏం చేస్తోందనేది అతిపెద్ద ప్రశ్న. ప్రతి దశలోనూ పర్యవేక్షణ ఉండాల్సిన అధికారులు కనీసం కన్నుతెరిచి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు ముట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మిల్లుల వద్ద తనిఖీలు నామమాత్రంగా మారడంతో వ్యాపారుల బరితెగింపు పరాకాష్టకు చేరింది.ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, పేదల పొట్ట కొడుతున్న ఈ "కేసముద్రం సీఎమ్ఆర్ స్కామ్"పై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కాకినాడ నుంచి వచ్చిన ధాన్యం లెక్కలు, కేసముద్రం గోదాముల్లో దించిన బియ్యం నిల్వల నాణ్యతపై ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడితే అసలు తిమింగలాలు బయటపడటం ఖాయమని పలువురు పేర్కొంటారు మరి ఆ దిశగా అధికారులు అడుగులు వేస్తారా లేదా వేచి చూడాల్సిందే మరి....



## కేసముద్రంలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి...

**- వేం నరేందర్ రెడ్డి....**



**కేసముద్రం సెప్టెంబర్ 25(ప్రభాత గమనం):**

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎటువంటి జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని ప్రముఖ నాయకులు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి అధికారులను మరియు నాయకులను ఆదేశించారు. స్థానిక కేసముద్రం పర్యటనలో భాగంగా ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గంట సంజీవరెడ్డి, సమ్మిగౌడ్, అంబటి మహేందర్ రెడ్డి, అల్లం నాగేశ్వరరావు, నీలం దుర్గేష్, వేముల శ్రీను, బండారు దయాకర్, కనుకుల రాంబాబు, లక్ష్మణ్, భద్రు, వెంకన్న, మురళి తదితరులు పాల్గొన్నారు

## లచ్చిరాం నాయక్ మృతి బాధాకరం...

**- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర...**



**కేసముద్రం సెప్టెంబర్ 25(ప్రభాత గమనం):**

కేసముద్రం స్టేషన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జాటోత్ హరీష్ నాయక్ తండ్రి జాటోత్ లచ్చిరాం నాయక్ (85) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కేసముద్రంలోని బాధిత కుటుంబాన్ని నేరుగా పరామర్శించారు.ఈ సందర్భంగా లచ్చిరాం నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి, వారిని ఓదార్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేత వద్దిరాజు కిషన్,మాజీ పట్టణ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్, మాజీ సర్పంచ్ కన్న యాకయ్య, రామచంద్రారెడ్డి, భూమాటి పురుషోత్తం, భూక్యా బాలు తదితరులు పాల్గొన్నారు.